VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ మంగళవారం 24 సెప్టెంబర్ 2024

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 73

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD





తిరుమల ఆలయంలో శాంతిహోమం




## భక్తిలేని చోట.. పవిత్రత ఉండదు

ఈశా ఫౌండేషన్ సంస్థాపకులు




## చైల్డ్ పోర్నోగ్రఫీ ముమ్మాటికీ నేరమే

దీనిని పోక్సో చట్టంలో చేర్చాలని కేంద్రానికి సూచన

మద్రాస్ హైకోర్టు తీర్పును రద్దు చేస్తూ సుప్రీం తీర్పు




## సిఎం రేవంత్‌తో మహేశ్ దంపతుల భేటీ

వరదబాధితులకు 50లక్షల చెక్కు అందచేత



# వన్ స్టేట్.. వన్ డిజిటల్ కార్డు విధానం

**పైలెట్ ప్రాజెక్టుగా అమలుకు నిర్ణయం**

**ఉన్నతస్థాయి సమీక్షలో సిఎం ఆదేశాలు**

**హైదరాబాద్:** రాష్ట్రంలో కుటుంబ డిజిటల్ కార్డుల జారీకి కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. డిజిటల్ కార్డులపై మంత్రులు దామోదర రాజనర్సింహ, ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. కుటుంబ డిజిటల్ కార్డుల జారీ కోసం ప్రతి నియోజకవర్గంలోని ఒక పట్టణం, ఓ గ్రామంలో పైలట్ ప్రాజెక్టు చేపట్టాలని రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. 'వన్ స్టేట్.. వన్ డిజిటల్ కార్డు' విధానం చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. రేషన్, ఆరోగ్య సేవలతోపాటు సంక్షేమ పథకాలన్నీ ఒకే కార్డు ద్వారా అమలు చేసేలా ప్రణాళిక చేస్తోంది. కుటుంబ డిజిటల్ కార్డు ద్వారా రాష్ట్రంలో ఎక్కడైనా సంక్షేమ పథకాలు పొందేలా ప్రణాళికలు వేయాలని సీఎం సూచించారు. డిజిటల్ కార్డులో కుటుంబ సభ్యులందరి హెల్త్ ప్రొఫైల్ పొందుపరిచి, దాని ద్వారానే ఆరోగ్య సేవలు అందించాలన్నారు. అర్హులందరికీ కుటుంబ డిజిటల్ కార్డులు అందేలా చర్యలు తీసుకోవాలని, దీని కోసం జిల్లాల వారీగా ప్రత్యేక వ్యవస్థ ఉండాలని సీఎం సూచించారు. రాజస్థాన్, హరియాణా, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో అమల్లో ఉన్న విధానాలను అధ్యయనం చేయాలని రేవంత్‌రెడ్డి ఆదేశించారు.

## జర్నలిజం విలువలకు కట్టుబడి ఉండాల్సిందే

రిజిస్ట్రేషన్ నిబంధనలు పాటించాల్సిందే

భావస్వేచ్ఛ పరిమితులకు లోబడి కార్యక్రమాలు

యూట్యూబ్ ఛానల్స్ గుర్తింపుపై రౌండ్ టేబుల్ సమావేశం




## హైదరాబాద్‌లో దంచికొట్టిన వాన




వరదనీటితో వాహనదారుల ఇక్కట్లు

తెలంగాణలో రెండ్రోజులు వాన హెచ్చరిక



## గాంధీ ఆస్పత్రి వద్ద తీవ్ర ఉద్రిక్తత

**బిఆర్ఎస్ బృందాన్ని అడ్డుకున్న పోలీసులు**

**ఆస్పత్రిలో వసతుల పరిశీలనకు వెళ్లిన టీమ్**

**పోలీసుల తీరుపై మండిపడ్డ బిఆర్ఎస్ నేత కెటిఆర్**

**హైదరాబాద్:** హైదరాబాద్ గాంధీ దవాఖాన వద్ద తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. దవాఖానలో పరిస్థితులను అధ్యయనం చేయడానికి వెళ్లిన బీఆర్ఎస్ నిజనిర్ధారణ కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా పోలీసులు, బీఆర్ఎస్ నాయకులకు మధ్య స్వల్ప తోపులాట చోటుచేసుకున్నది. మాజీ ఉపముఖ్యమంత్రి రాజయ్యతోపాటు మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్, మాగంటి గోపీనాథ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని అక్కడినుంచి తరలించారు. పోలీసు వాహనాన్ని అడ్డుకునేందుకు బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రయత్నించారు.

గాంధీ సహా రాష్ట్రంలోని ప్రభుత్వ దవాఖానల అధ్వాన పరిస్థితిని


- మిగతా 2వ పేజీలో




నిన్న కూల్చివేతలలో నష్టపోయిన వారికి నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. శనివారం, ఆదివారం హైడ్రా కాదు హైడ్రామా చేస్తున్నారని వ్యాఖ్యలు చేశారు. కోర్టు ఆదేశాలకు వ్యతిరేకంగా నిన్న కూల్చివేతలు చేపట్టారని విమర్శించారు. ప్రజలను సంక్షేమ పథకాల నుంచి దారి మళ్లించేందుకు హైడ్రా కూల్చివేతలు చేస్తున్నారని మాధవరం కృష్ణారావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

# హైడ్రాతో ప్రజల్లో భయాందోళనలు

## దుర్గం చెరువు ఎఫ్‌టిఎల్ నిర్ధారించండి

అప్పటి వరకు కూల్చివేతలు ఆపండి

బాధితుల ఫిర్యాదుతో హైకోర్టు ఆదేశాలు



**హైదరాబాద్ :** శనివారం, ఆదివారం వస్తుందంటే హైదారాబాద్‌లో ప్రజలు భయంతో ఉండాల్సిన పరిస్థితి ఉందని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు వ్యాఖ్యానించారు. కూకట్‌పల్లి నల్ల చెరువులో హైడ్రా కూల్చివేతలపై సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. హైడ్రా కమిషనర్ వ్యాఖ్యలకు ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. కూల్చివేతలు చేశాక డెబ్రిస్ తీసివేయకుండా, చెత్తను జమ చేస్తున్నారని తెలిపారు. నల్ల చెరువులో ఆదివారం కూల్చివేతలు చేపట్టిన స్థలం పట్టదారులకు చెందిందని.. పట్టాదారులకు ఏ విధమైన న్యాయం చేయనున్నారని ప్రశ్నించారు. చెరువులలో పట్టాలు ఉన్న వారికి నష్ట పరిహారం చెల్లించి, ఆ స్థలాన్ని ప్రభుత్వం తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిన్న షెడ్లు కూల్చివేస్తున్న సమయంలో అక్కడ ఉంటున్న వారికి కనీసం వారి సామాన్లను తరలించేందుకు కూడా సమయం ఇవ్వకపోవడం దురదృష్టకరమని మండిపడ్డారు. హైడ్రా విధి విధానాలను స్పష్టం చేయాలన్నారు. రాత్రి నోటీసులు ఇచ్చి, ఉదయాన్నే కూల్చి వేస్తే అక్కడ ఉంటున్న వారి పరిస్థితి ఏంటి అంటూ మండి పడ్డారు. నిన్న కూల్చివేతలలో నష్టపోయిన వారికి నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. శనివారం, ఆదివారం హైడ్రా కాదు హైడ్రామా చేస్తున్నారని వ్యాఖ్యలు చేశారు. కోర్టు ఆదేశాలకు వ్యతిరేకంగా నిన్న కూల్చివేతలు చేపట్టారని విమర్శించారు. ప్రజలను సంక్షేమ పథకాల నుంచి దారి మళ్లించేందుకు హైడ్రా కూల్చివేతలు చేస్తున్నారని మాధవరం కృష్ణారావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.కాగా.. కూకట్‌పల్లిలో, అమీన్‌పూర్ మునిసిపాలిటీలోని కిష్టారెడ్డిపేట, పటేల్‌గూడలో ప్రభుత్వ భూముల్లోని నిర్మాణాలను నిన్న హైడ్రా నేలమట్టం చేసిన విషయం తెలిసిందే.

కూకట్‌పల్లి శాంతినగర్‌లోని నల్లచెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో నాలుగు ఎకరాల విస్తీర్ణంలో, కిష్టారెడ్డిపేటలోని ఎకరంపైగా, పటేల్‌గూడలోని మూడు ఎకరాలకు పైగా విస్తీర్ణంలోని నిర్మాణాలను కూల్చివేసింది.

# తిరుమల ఆలయంలో శాంతిహోమం







**తిరుమల:** శ్రీవారి ఆలయంలో జరిగిన దోషాలకు ప్రాయశ్చిత్తంగా శాంతి హోమం నిర్వహించారు. ఆలయంలోని అన్ని విభాగాల్లో ప్రోక్షణ కార్యక్రమాలు చేపట్టారు. తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడకంతో అపచారం జరిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం శ్రీవారి ఆలయంలో మహా శాంతియాగం చేపట్టారు. పూర్ణాహుతితో శాస్త్రోక్తంగా హోమం పూర్తి అయ్యింది. సోమవారం రోహిణి నక్షత్రం శ్రీవారికి ముహూర్త బలం కావడంతో ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు మహాశాంతి యాగాన్ని నిర్వహించారు. ఆలయంలోని యాగశాలలో ఆగమ పండితులు, అర్చకులు హోమం నిర్వహించారు. ముందుగా మహాశాంతి యాగం, వాస్తు హోమం నిర్వహణ జరిగింది. కాగా శ్రీవారికి నిర్వహించే ఆర్జితసేవలకు ఆటంకం కలగకుండా ఒక్కరోజు మాత్రమే యాగం నిర్వహించేలా ఆగమ పండితులు నిర్ణయించారు. ప్రస్తుతం మహాశాంతియాగం ముగియగా.. పంచగవ్యాలతో శ్రీవారి ఆలయంతో పాటు వకుళ మాత పోటు, లడ్డు పోటు, బూందీ పోటు, ప్రసాద విక్రయశాలల్లో అర్చకులు సంప్రోక్షణ చేపట్టారు. ఆలయంలో శాంతి హోమం, పంచగవ్య ప్రోక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమాల అనంతరం తితిదే ఈవో శ్యామలరావు, ఆలయ అర్చకులు మీడియాతో మాట్లాడారు. ఆలయంలోని అన్ని విభాగాల్లో ప్రోక్షణ కార్యక్రమాలు చేసినట్లు ఆలయ ప్రధానార్చకులు వేణుగోపాల దీక్షితులు తెలిపారు. స్వామి వారికి మహానైవేద్యం పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రసాదాల తయారీ కేంద్రాల్లో ప్రోక్షణ చేస్తున్నామని అన్నారు. దోషం కలిగిందన్న భావన లేకుండా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. చివరిగా పూర్ణాహుతి కార్యక్రమంతో అన్ని దోషాలు తొలగుతాయని తెలిపారు. భక్తులెవరూ ఆందోళన చెందవద్దన్నారు. ఇటీవల జరిగిన దోషాలు తొలగిపోవాలని శాంతి హోమం చేశాం. పవిత్రోత్సవాలకు ముందే నెయ్యి మార్చేశాం. లడ్డూ ప్రసాదం విషయంలో ఇకపై ఎలాంటి అనుమానాలొద్దు. పవిత్రోత్సవాల ముందు జరిగిన దోషం.. పవిత్రోత్సవాలతో పోయింది. మార్చిన నెయ్యితోనే ఆ తర్వాత ప్రసాదాలు తయారుచేశాం. తెలిసీ తెలియక జరిగిన దోషాలు శాంతిహోమం, ప్రోక్షణతో తొలగుతాయని వేణుగోపాల దీక్షితులు అన్నారు. తిరుమలలో కలకలం రేపిన కల్తీ నెయ్యి దోషాన్ని గత నెల ఆగస్టులో సంప్రోక్షణతో పోగొట్టామని, భక్తులు ఎవరూ ఆందోళన చెందవద్దని టీటీడీ కార్యనిర్వహణాధికారి శ్యామలరావు వెల్లడించారు. తిరుమల ఆలయంలో నిర్వహించే అనేక కార్యక్రమాల్లో తెలుసో తెలియక జరిగే దోష నివారణకు ప్రతి ఏడాది శ్రావణ మాసంలో పవిత్రోత్సవాలు నిర్వహిస్తాం. ఇందులో భాగంగా ఆగస్టులోనే ఆలయంలో అన్న ప్రసాదపోటు, లడ్డూ పోటులో సంప్రోక్షణ చేశాం. అందులోని కృష్ణస్వామి మూర్తులకు పవిత్రాలను సమర్పించాం. కల్తీ నెయ్యి వలన ఏమైనా దోషాలు ఉండుంటే కూడా తొలగిపోయాయి. అయినప్పటికీ భక్తుల్లో నెలకొన్న ఆందోళన దృష్ట్యా ఆగమశాస్త్ర పండితులు, పెద్దజియ్యంగార్లను సంప్రదించిన తర్వాత సీఎం చంద్రబాబు శ్రీవారి ఆలయంలో
ఒకరోజు శాంతి హోమం నిర్వహిస్తే బాగుంటుందని సూచించారు. ఇందులో భాగంగా సోమవారం ఉదయం 6 నుంచి 10 గంటల వరకు శాంతిహోమం చేపట్టామని అన్నారు. శ్రీవారి ఆలయంలోని యాగబావి వద్ద యాగశాలలో, మూడు హోమగుండాలు (వాస్తు, సభ్యం, పౌండరీక) ఏర్పాటు
చేసి శాస్త్రోక్తంగా నిర్వహించామని అన్నారు. అదేవిధంగా అన్ని ఆలయాల్లో పంచగవ్య ప్రోక్షణ చేపట్టామని ఈవో శ్యామలరావు వివరించారు.

# భక్తిలేని చోట..పవిత్రత ఉండదు

చెన్నై: తిరుపతి ప్రసాదంలో బీఫ్ టాలో ఉందన్న వార్త అసహ్యాన్ని కలిగించిందని ఈశా ఫౌండేషన్ సంస్థాపకులు సద్గురు జగ్గీ వాసుదేవ్ చెప్పారు. హిందూ దేవాలయం భక్తులచే నిర్వహించబడాలి కానీ ప్రభుత్వాల ఆధీనంలో ఉండకూడదన్నారు. ఈ సంఘటన అసహ్యకరమైనదని.. భక్తులకు ఇచ్చిన ప్రసాదంలో జంతు కొవ్వు కలిసి ఉండడం మహాపరాధంగా పేర్కొన్నారు. హిందూ దేవాలయాల పవిత్రతను కాపాడుకోవడానికి వాటిని భక్తులు ఆధీనంలో ఉంచాలని ఉద్ఘాటించారు. అందుకే భక్తులే ఆలయాలు నడిపాలని.. ప్రభుత్వాలు గుడులపై తమ పెత్తనాన్ని విడనాడాలని తామంతా కోరేదన్నారు. వివాదాన్ని ప్రస్తావిస్తూ, సద్గురు సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ ఎక్స్ లో పోస్ట్ చేసారు. గొడ్డు కొవ్వు కలిసిన ప్రసాదం హిందూ భక్తులు తినేలా చేయడం అసహ్యాన్ని కలిగించేది. అందుకే దేవాలయాలు ప్రభుత్వ పాలనలో కాకుండా భక్తుల ఆధీనం నడవాలి. భక్తి లేని చోట పవిత్రత ఉండదు. హిందూ దేవాలయాలు ప్రభుత్వ పరిపాలన ద్వారా కాకుండా భక్తులైన హిందువులచే నిర్వహించబడమే మంచిది. అని ఆయన రాసుకొచ్చారు. ప్రఖ్యాత తిరుపతి దేవస్థానంలోని ప్రసాదంలో బీఫ్ టాలో మిళితమైందని వచ్చిన వార్తలకు ప్రతిస్పందనగా ఆయన ఈ ట్వీట్ చేశారు. ఈ అంశంపై దేశవ్యాప్తంగా ఆగ్రహావేశాలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజల నిరసనల మధ్య, హిందూ దేవాలయాల పవిత్రత, సమగ్రతను కాపాడే లక్ష్యంతో ఆలయ నిర్వహణను తిరిగి భక్తులకే ఇవ్వాలన్న డిమాండ్స్ పెరుగుతున్నాయి.

# చైల్డ్ పోర్నోగ్రఫీ ముమ్మాటికీ నేరమే

**న్యూఢిల్లీ:** చైల్డ్ పోర్నోగ్రఫీ ముమ్మాటికీ నేరమేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దీనిని చూడటం నేరం కాదని మద్రాసు హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు సోమవారం తీర్పు వెలువరించింది. చైల్డ్ పోర్నోగ్రఫీ చూడటం, ఆ వీడియోలను డౌన్‌లోడ్ చేసుకోవడం పోక్సో చట్టం కింద నేరమేనని వెల్లడించింది. ఈమేరకు మద్రాసు హైకోర్టు ఇచ్చిన తీర్పును అత్యున్నత న్యాయస్థానం పక్కనబెట్టింది. ఇలాంటి తీర్పునిచ్చి హైకోర్టు ఘోరమైన తప్పిదం చేసిందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా కేంద్రానికి పలు సూచనలు చేసింది. పోక్సో చట్టంలో 'చైల్డ్ పోర్నోగ్రఫీ అనే పదాన్ని 'చైల్డ్ సెక్సువల్ ఎక్స్‌ప్లాయిటేటివ్ అండ్ అబ్యూసివ్ మెటీరియల్' అనే పదంతో మారుస్తూ పోక్సో చట్టానికి సవరణలు చేయాలని పార్లమెంట్‌కు తెలిపింది. ఆ సవరణలు అమల్లోకి వచ్చేవరకు దీనిపై ఆర్డినెన్స్ జారీ చేసుకోవచ్చని తెలిపింది. ఇకపై కోర్టులు 'చైల్డ్ పోర్నోగ్రఫీ' పదాన్ని ఉపయోగించవద్దని ఆదేశించింది. చైల్డ్ పోర్నోగ్రఫీని డౌన్‌లోడ్ చేసుకున్నాడని ఆరోపణలు ఎదుర్కొంటున్న యువకుడిపై క్రిమినల్ చర్యలను నిలిపివేస్తూ జనవరి 11న మద్రాసు హైకోర్టు ఆదేశాలిచ్చింది. పోక్సో, ఐటీ చట్టాల ప్రకారం.. చైల్డ్ పోర్నోగ్రఫీని చూడటం తప్పేమీ కాదంటూ ఆ సందర్భంగా వ్యాఖ్యానించింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న
28 ఏళ్ల యువకుడు వీడియోలు చూడటం తప్ప ఏమీ చేయలేదని, వాటిని ఇతరులకూ పంపలేదని పేర్కొంది. పోర్నోగ్రఫీకి అలవాటుపడిన యువతను శిక్షించడం కన్నా వారిని సరైన మార్గం వైపు నడిపించడంపై దృష్టి పెట్టాలని అభిప్రాయపడింది. ఈ తీర్పుపై పలు ఎన్జీవోలు, చిన్నారుల సంక్షేమ సంఘాలు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశాయి. వీటిపై విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం.. హైకోర్టు తీర్పును తోసిపుచ్చింది. సదరు యువకడిపై క్రిమినల్ చర్యలను పునరుద్ధరించింది.

# హైదరాబాద్‌లో దంచికొట్టిన వాన



**హైదరాబాద్,:** హైదారాబాద్ మహా నగరంలో పలు చోట్ల వర్షం కురిసింది. తార్నాక, ఓయూ క్యాంపస్, లాలాపేట, హబ్సిగూడ, నాచారం, మల్లాపూర్, దిల్‌సుఖ్‌నగర్, చంపాపేట్, సైదాబాద్, సరూర్‌నగర్, కోఠి, చాంద్రయణగుట్ట, మాదాపూర్, బంజారాహిల్స్ తదితర ప్రాంతాల్లో వర్షం పడింది. రహదారులపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. హైదరాబాద్ సిటీలో ఎప్పుడు.. ఎంత వర్షం పడుతుందో ఎవరికీ అర్థం కావటం లేదు. అప్పటికప్పుడు మారిపోతున్న వాతావరణంతో.. కొన్ని ప్రాంతాల్లో కుండపోత వర్షం పడుతుంది. సోమవారం సాయంత్రం.. హైదరాబాద్ సిటీలోని కొత్తపేట, చైతన్యపురి ఏరియాల్లో కుండపోత వాన పడింది. గంటపాటు దంచికొట్టింది. కుండపోత వర్షానికి చైతన్యపురి, కొత్తపేట ఏరియాల్లోని వీధులు అన్నీ జలమయం అయ్యాయి. ఇవి రోడ్లా లేక నదులా అన్నట్లు మోకాళ్ల లోతు నీళ్లు ప్రవహించాయి. ఆఫీసుల నుంచి ఇళ్లకు వెళ్లే సమయం.. పిల్లలు స్కూల్స్, ట్యూషన్ల నుంచి ఇంటికి చేరే సమయం కావటంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వీధుల్లో మోకాళ్ల లోతు నీటితో వాహనదారులు ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ఎక్కడ మ్యాన్ హోల్ ఉంది.. ఎక్కడ గుంతలు ఉన్నాయి అనేది తెలియక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొన్ని చోట్ల వాహనాలు నీటిలో మునిగిపోయాయి. రోడ్లపై వెళుతున్న వాహనాలు ఆగిపోయాయి. దీంతో వాహనదారులు.. జోరు వర్షంలో.. మోకాళ్ల లోతు నీటిలోనే తోసుకు వెళ్లటం కనిపించింది. ఇకపోతే తెలంగాణలోని పలు జిల్లాల్లో రెండ్రోజులు అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రానున్న మూడు రోజులు ఉరుములు మెరుపులతోపాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశాలున్నాయని తెలిపింది. పశ్చిమ-మధ్య బంగాళాఖాతం వద్ద, మయన్మార్ దక్షిణ తీరం దాని పరిసర ప్రాంతాల్లో కొనసాగుతున్న రెండు ఆవర్తనాలు ఈరోజు విలీనమై
మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనంగా ఏర్పడుతుందని వాతావరణ కేంద్రం సంచాలకులు పేర్కొన్నారు. ఇది సగటు సముద్ర మట్టానికి 5.8 కి.మీ. ఎత్తులో కొనసాగుతుందన్నారు. దీని ప్రభావం కారణంగా రాగల 24 గంటల్లో పశ్చిమ -మధ్య బంగాళాఖాతం దాని పరిసర ప్రాంతాల్లో అల్ప పీడన ప్రాంతం ఏర్పడే అవకాశం ఉందని వెల్లడించారు.

# జర్నలిజం విలువలకు కట్టుబడి ఉండాల్సిందే




**హైదరాబాద్:** జర్నలిజం విలువలకు కట్టుబడి, చట్టబద్ధంగా పనిచేస్తున్న యూట్యూబ్ ఛానళ్లను మాత్రమే గుర్తించాలని మీడియా అకాడమి నిర్ణయించింది. యూట్యూబ్ న్యూస్ చానల్స్ గుర్తింపు అక్రిడిటేషన్ల జారీ, తదితరాలకు, నియమ నిబంధనలు,అనుసరించాల్సిన విధివిధానా లపై, తెలంగాణ మీడియా అకాడమి చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఇందులో ప్రముఖ సంపాదకులు, సీనియర్ జర్నలిస్టులు, యూట్యూబ్ చానెల్స్ నిర్వాహకులు పాల్గొని పలు సూచనలు చేశారు. రౌండ్ టేబుల్ సమావేశంలో దాదాపు 50 మంది సీనియర్ జర్నలిస్టులు, సంపాదకులు,యూట్యూబ్ ఛానల్ ప్రతినిధులు వాటి వ్యవస్థాపకులు హాజరయ్యారు. పత్రికలకు ఆర్ఎన్ఐ రిజిస్ట్రేషన్, టీవీ చానల్స్ కు మినిస్ట్రీ ఆఫ్ ఇన్ఫర్మేషన్ / బ్రాడ్కాస్టింగ్ గుర్తింపు, కంపెనీ ఆక్ట్ కింద నమోదు కావటం యూట్యూబ్ న్యూస్ చానెల్స్ కి కూడా అవసరమని అభిప్రాయపడ్డారు. న్యూస్ వెబ్సైట్లకి కూడా అలాంటి నియమనిబంధనలే ఉన్నాయన్నది గుర్తు చేశారు. యూట్యూబ్ ఛానల్స్ గుర్తింపునకు అనుసరించాల్సిన అంశాల పై ఈ కార్యక్రమంలో సుదీర్ఘ చర్చ జరిగింది. ఈ విషయాలు కేంద్ర ప్రభుత్వం పరిధిలోని అంశాలు అయినందున వాటిని అమలుపర్చాల్సిన కర్తవ్యం యూట్యూబ్ చానెల్స్ పై ఉందని సమావేశం అభిప్రాయబడింది. అకాడమి ఇలాంటి సమావేశం ఏర్పాటు చేయడం పట్ల సమావేశంలో పాల్గొన్న వాళ్ళందరూ హర్షం వెలిబుచ్చారు. ఇంకా దీనిపై నిర్దిష్ట చర్యలు జరపడానికి మరిన్ని చర్చలు జరపాలని, రౌండ్ టేబుల్ లో పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు. ఇలాంటి కార్యక్రమాల నిర్వహణలో ఇది మొదటిదని మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ అంశం పై ఇంకా లోతైన చర్చ జరగాల్సి ఉందన్నారు. భావస్వేచ్ఛకు ఉన్న పరిమితులకు లోబడి, జర్నలిజం వృత్తికి అనుగుణంగా, ఎప్పటికప్పుడు వార్తలు, చర్చా గోష్టిలు, ఇంటర్వ్యూలు, ప్రత్యేక కథనాలు ప్రసారం చేస్తున్న యూట్యూబ్ సంస్థలను మాత్రమే మీడియా సంస్థలుగా గుర్తించవచ్చనే అభిప్రాయం వ్యక్తం అయ్యింది. సబ్ స్క్రయిబర్స్, వ్యూస్ ని ప్రధాన క్రైటేరియగా తీసుకోరాదని, ఎందుకంటే అంగట్లో సరుకుల్లాగా వాటి విక్రయం జరుగుతుందని పలువురు అభిప్రాయ పడ్డారు. వ్యక్తిగత ఎజెండాలతో, ద్వేషాలతో, కక్ష్యపూరిత ధోరణులతో, సమాజాన్ని తప్పు ద్రోవ పట్టించే వైఖరితో ప్రసారాలు చేస్తున్న వారిని పరిగణలోకి తీసుకోకపోవడం మంచిదనే అభిప్రాయం వ్యక్తం అయ్యింది.ఎలాంటి చట్టబద్ధత లేకుండా యూట్యూబ్ ప్లాట్ ఫామ్ లు సృష్టించి, హద్దు అదుపు లేకుండా చెలామణి అవుతున్న వారికి గుర్తింపు ఇవ్వడం ద్వారా మీడియా వ్యవస్థకు మచ్చ కలుగుతుందని, ఇందుకుగాను సంస్థ రిజిస్ట్రేషన్, లేబర్ లైసెన్స్, పోస్టల్ లైసెన్స్, ట్రేడ్ మార్క్ లైసెన్స్, జీఎస్టీ రిజిస్ట్రేషన్, కార్యాలయ నిర్వహణ తీరు, సిబ్బంది తదితర అంశాలను పరిశీలించాలనే అభిప్రాయం వ్యక్తం అయ్యింది. యూట్యూబర్స్ చేస్తున్న ప్రసారాలు జర్నలిజం నైతిక ప్రమాణాలకు కట్టుబడి ఉండాల్సిన అవసరం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తం అయ్యింది. సియాసత్ మేనేజింగ్ ఎడిటర్, ఎమ్మెల్సీ ఆమెరలి ఖాన్, ఆంధ్రజ్యోతి ఎడిటర్ కే. శ్రీనివాస్ , ముఖ్యమంత్రి సి పి ఆర్ ఓ, అయోధ్య రెడ్డి, మీడియా అకాడమి పూర్వాధ్యక్షులు అల్లం నారాయణ, ప్రముఖ జర్నలిస్టులు దిలీప్ రెడ్డి, కట్టా శేఖర్ రెడ్డి, పద్మజా షా, ఎం. ఏ. మాజీద్, కరుణాకర్ దేశాయ్, జర్నలిస్ట్ నాయకులు విరహత్ అలీ, సోమయ్య, పలు యూట్యూబ్ ఛానళ్ల ప్రతినిధులు, సమాచార శాఖ జాయింట్ డైరెక్టర్ జగన్, మీడియా అకాడమి సెక్రటరీ వెంకటేశ్వరరావు, తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

# నెయ్యిలో ఖరీదైన పంది కొవ్వు కలుపుతారా

## రాగిలో ఎవరైనా బంగారం కలుపుతారా

## వైసిపి లాయర్ పొన్నవోలు వితండ వాదన

**న్యూఢిల్లీ:** తిరుమల శ్రీవారి ప్రసాదానికి ఉపయోగించే నెయ్యిలో ఖరీదైన పందికొవ్వు ఎలా కలుపుతారని, ఈ మాత్రం కూడా తెఇయదా అని ఢిల్లీలో జరిగిన మీడియా సమావేశంలో వైఎస్ఆర్‌సీపీ ముఖ్య నేత, లాయర్ పొన్నవోలు సుధాకర్ రెడ్డి స్పష్టం చేశారు. ఎందుకంటే.. నెయ్యి కంటే పంది కొవ్వు రేటు చాలా ఎక్కువ అన్నారు. వైవీ సుబ్బారెడ్డి తరఫున సుప్రీంకోర్టులో తిరుమల లడ్డూ కల్తీ అంశంపై పిటిషన్ దాఖలు చేసిన తర్వాత మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. ఎస్ వాల్యూ తగ్గిలందంటే .. కల్తీ జరిగిందని అర్థం కానీ.. ఆ కల్తీ పంది కొవ్వు కాదని ఆయన అంటున్నారు. అంటే కల్తీ జరిగిందని వైసీపీ లాయర్ కూడా నిర్ధారించినట్లయింది. అదే సమయంలో పందికొవ్వు కేజీ రూ. 1450 వరకూ ఉంటుందని.. కానీ నెయ్యి మాత్రం రూ. నాలుగు వందలు మాత్రమేనన్నారు. ఎవరైనా రూ. నాలుగు వందలు మాత్రమే ఉన్న నెయ్యిలో
రూ. పధ్నాలుగు వందల విలువ చేసే పందికొవ్వును కలుపుతారా అని ప్రశ్నించారు. రాగి చెంబులో ఎవరైనా బంగారాన్ని కలుపుతారా.. ఇత్తడిలో ఎవరైనా గోల్డ్ కలుపుతారా అని ప్రశ్నించారు. లాయర్ పొన్నవోలు సుధాకర్ రెడ్డి మాటలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. ఆయన మరో పోలిక కూడా తెచ్చారు. రాగిలో ఎవరైనా బంగారం కలుపుతారా అని కూడా ప్రశ్నించారు. అంటే.. తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం రాగి.. పందికొవ్వు బంగారమా అని సోషల్ మీడియాలో నెటిజన్లు ప్రశ్నించడం ప్రారంభించారు. లడ్డూ అంశంపై జరుగుతున్న ప్రచారంలో నిజానిజాలు వెలికి తీయాలనే తాను వైవీ సుబ్బారెడ్డి తరఫున హైకోర్టులో పిటిషన్ వేశానన్నారు. ఏపీ ప్రభుత్వం వేసిన సిట్‌తో నిజాలు బయటకు వచ్చే అవకాశం లేదని.. ఆయన యానిమల్ ఫ్యాట్ ఉందని చెప్పారు కాబట్టి చంద్రబాబు కింద పనిచేసే ఏజెన్సీలు అవే చెబుతాయన్నారు. దీనిపై సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి పర్యవేక్షణలో ఫుడ్ టెక్నాలజీ నిపుణులతో విచారణ జరిపించాలని సుప్రీంకోర్టును కోరుతున్నామన్నారు. ఆర్ ఫుడ్స్ సప్లై చేసిన 10 ట్యాంకులలో నాలుగు ట్యాంకుల్లో కల్తీ ఉందని.. ఈ ట్యాంకులలో వనస్పతి ఉందని మొదట టీటీడీ ఈవో చెప్పారని పొన్నవోలు చెప్పారు. ట్యాంకులు ముందుగానే ఒక సర్టిఫికెట్‌తో తిరుమలకు వస్తాయని, ఆ వచ్చిన ట్యాంకులను టీటీడీ 3 పరీక్షలు నిర్వహిస్తుందని .. ఆ టెస్టుల్లో పాసయితేనే... లడ్డూల తయారీకి వినియోగ్సాతరన్నారు. టెస్టుల్లో ఫెయిల్ అయితే వెనక్కి పంపిస్తారన్నారు. తిరుమలలో నెయ్యిని టెస్టు చేసే ల్యాబులు లేవని చెప్పారని..త కానీ ఉన్నాయని పొన్నవోలు వాదించారు.

# ధర్మవరం సబ్ జైలు వద్ద స్వల్ప ఉద్రిక్తత

**వైకాపా, బిజెపిల పరస్పర ఘర్షణ**

ధర్మవరం: సత్యసాయి జిల్లా ధర్మవరం సబ్ జైలు వద్ద స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. కేతిరెడ్డి (వైకాపా), హరీశ్ (భాజపా) వర్గీయుల మధ్య ఘర్షణ తలెత్తింది. హరీశ్ తన
అనుచరులతో వస్తుండగా కేతిరెడ్డి వర్గీయులు వాహనాలు అడ్డుగా పెట్టారు. వాహనాలు అడ్డు తొలగించమని కోరగా.. వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో కేతిరెడ్డి వెంట్రామిరెడ్డి డ్రైవర్‌ను హరీశ్ వర్గీయులు చితకబాదారు. కేతిరెడ్డి దురుసుగా వ్యవహరించారని హరీశ్ వర్గీయులు చెబుతున్నారు. ధర్మవరం సబ్‌జైలులో ఖైదీ పరామర్శకు కేతిరెడ్డి వచ్చిన సమయంలో ఘర్షణ చోటు చేసుకుంది. తాజా పరిస్థితుల నేపథ్యంలో కూటమి నాయకులు, కార్యకర్తలు జైలు వద్దకు చేరుకున్నారు. వారి మధ్య రాజీ కుదిర్చేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

## ఏడు పదుల్లోకి ఏడుగురు స్నేహితులు


విశాఖపట్నం: గత 50 ఏళ్లుగా తనతో స్నేహం కొనసాగించిన ఏడుగురు స్నేహితులు 70వ ఏడాదిలోకి అడుగుపెట్టిన సందర్భంగా మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు వారిని సన్మానించారు. 1972, 1973 సంవత్సరాల్లో ఏర్పడిన స్నేహబంధం ఇప్పటికీ కొనసాగుతున్న నేపథ్యంలో విశాఖపట్నంలో ' సప్తతి' పేరుతో వెంకయ్యనాయుడు దంపతులు ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గతజ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఇందులో మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబు, అట్లూరి అశోక్, తుమ్మల రంగారావు, వీరమాచినేని రంగప్రసాద్, తిపురనేని జేజీ ప్రసాద్, బిక్కిన లక్ష్మణరావు, సూర్యదేవర జోగేంద్రదేవ్ ఉన్నారు. అందరూ తమ మధ్య ఉన్న అనుబంధాలను పంచుకొన్నారు. ఈ కార్యక్రమానికి అనుకోని అతిథిగా సూపర్‌స్టార్ రజనీకాంత్ హాజరయ్యారు. రాడిసన్‌బ్లూ హోటల్‌లో బసచేసేందుకు వెళ్లిన ఆయన.. వెంకయ్యనాయుడు అక్కడే ఉన్నారని తెలుసుకొని ఆయన వద్దకు వెళ్లారు. స్నేహితులతో కలిసి భోజనం చేస్తున్న వెంకయ్యనాయుడుని కలిసి అభినందించి వెళ్లారు.

# గాంధీ ఆస్పత్రి వద్ద తీవ్ర ఉద్రిక్తత

అధ్యయనం చేసేందుకు రాజయ్య నేతృత్వంలో బీఆర్ఎస్ నిజ నిర్ధారణ కమిటీని నియమించిన విషయం తెలిసిందే. సోమవారం నుంచి నిపుణులైన డాక్టర్లతో కూడిన త్రిసభ్య కమిటీ క్షేత్రస్థాయి పరిశీలన ప్రారంభించింది. ఇందులో భాగంగా గాంధీ దవాఖానను పరిశీలించాల్సి ఉన్నది. అయితే కమిటీ పర్యటనను కాంగ్రెస్ సర్కార్ అడ్డుకున్నది. రాజయ్య సహా కమిటీ సభ్యులైన మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, ఎమ్మెల్యే సంజయ్‌ను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. అనేక నిర్బంధాల నడుమ గాంధీ దవాఖానకు చేరుకున్న కమిటీ సభ్యులతోపాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అరెస్టు చేశారు. మరోవైపు జనగామ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో నుంచి బయటకు రాకుండా భారీగా పోలీసులు మోహరించారు. ఇదిలావుంటే గాంధీ ఆస్పత్రి వద్ద బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేయడాన్ని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. ఎక్స్ (ట్విట్టర్) వేదికగా స్పందిస్తూ.. ప్రభుత్వాస్పత్రుల్లో ఉన్న పరిస్థితులను తెలుసుకునేందుకు వెళ్లిన త్రిసభ్య కమిటీ సభ్యులను అరెస్ట్ చేయటమా.. అసలు ప్రభుత్వానికి ఎందుకంత భయం.. కమిటీ తన పని తాను చేసుకొని పోతే నిజం బయటపడుతుందనా.. అసమర్థ చేతగాని ప్రభుత్వం అసలు రంగు బయట పడుతుందనా అంటూ ట్వీట్ చేశారు..నిజంగా ప్రభుత్వం ఏమీ దాచటం లేదంటే బీఆర్ఎస్ నిజ నిర్ధారణ కమిటీని దర్యాప్తు చేయనివ్వండి. కమిటీ నివేదిక ద్వారా
ప్రజలు పడుతున్న ఇబ్బందులు ప్రభుత్వానికి తెలుస్తాయి. ప్రజారోగ్యాన్ని మరింత మెరుగుపర్చేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి ప్రభుత్వానికి సూచనలు అందుతాయి. కానీ ముఖ్యమంత్రి మాత్రం అవేవి జరగవద్దన్న ఇగోతో వ్యవహరిస్తున్నాడు. తెలంగాణ ప్రజల జీవితాలతో సీఎం చెలగాటం ఆడుతున్నాడు. ఇలాంటి పిచ్చి పనులను సీఎం మానేయాలని విజ్ఞప్తి చేస్తున్నా అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

కాగా.. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వాస్తవ పరిస్థితులను పరిశీలించేందుకు బీఆర్ఎస్ త్రీ మెన్ కమిటీని నియమించింది. ఈరోజు ఉదయం 10 గంటలకు గాంధీ ఆస్పత్రికి బీఆర్ఎస్ నేతలు తాటికొండ రాజయ్య, ఎమ్మెల్యే సంజయ్, మెతుకు ఆనంద్ వెళ్లాల్సింది. అయితే ముందుగానే అప్రమత్తమైన పోలీసులు కమిటీ మెంబర్స్‌ను హౌజ్ అరెస్ట్ చేశారు. తమను పోలీసులు అడ్డుకుంటున్నారని, హౌజ్ అరెస్టులు చేస్తున్నారని బీఆర్ఎస్ త్రిసభ్య కమిటీ సభ్యులు ఆరోపించారు. . వికారాబాద్‌లో మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌ను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. త్రిసభ్య కమిటీలో ఆనంద్ సభ్యుడిగా ఉన్నారు. గాంధీ ఆసుపత్రికి వెళ్లనీయకుండా ఆనంద్‌ను పోలీసులు ఇంట్లోనే ఉంచారు. విషయం తెలిసిన కార్యకర్తలు భారీగా ఆనంద్ ఇంటి వద్దకు చేరుకుంటున్నారు. ఇంట్లోకి పోలీసులు వెళ్లకుండా కార్యకర్తలు అడ్డంగా కూర్చున్నారు. మరోవైపు ఆనంద్ ఇంటి చుట్టూ పోలీసులు పహారాకాసారు.

వేగుచుక్క
TELUGU DAILY NEWS
3
మంగళవారం 24 సెప్టెంబర్ 2024



## మూఢనమ్మకాలపై జెవివి అవగాహన.

**వేగుచుక్క న్యూస్, నవిపేట, సెప్టెంబర్ 23**

మండలంలోని లిటిల్ ఫ్లవర్, స్కాలర్స్, ప్రభుత్వ బాలుర, బాలికల పాఠశాలల్లో జన విజ్ఞాన వేదిక నిజామాబాద్ జిల్లా గౌరవ అధ్యక్షులు రిటైర్డ్ హెడ్ మాస్టర్ విజయానందరావు ఉపాధ్యాయులకు సోమవారం అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు శాస్త్రీయబద్ధంగా ఆలోచించాలని, విద్యార్థులకు ప్రశ్నించేతత్వాన్ని అలవర్చాలని అన్నారు. మ్యాజిక్ ప్రదర్శనలతో ఉపాధ్యాయులను చైతన్యపర్చారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులతో పాటు జన విజ్ఞాన వేదిక నాయకులు రాజశేఖర్ భూమరావు, చంద్రశేఖర్ జన చైతన్య వేదిక జిల్లా అధ్యక్షులు డి.సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

## సోనియాకు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల కప్పం

**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు భారీగా అప్పులు చేసి.. ఆ మొత్తాన్ని సోనియా గాంధీకి సమరిస్తున్నాయని భాజపా ఎంపీ కంగనా రనౌత్ చేసిన ఆరోపణలపై కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా మండిపడింది. కంగనా చేసిన ఆరోపణలను రుజువు చేయాలని.. లేదంటే నిరాధార ఆరోపణలు చేసినందుకు సోనియాకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసింది. లేనిపక్షంలో పరువునష్టం దావా వేస్తామని హెచ్చరించింది. కంగనా చేసిన వ్యాఖ్యలు ఆమె మానసిక స్థితిని తెలియజేస్తున్నాయి. ఆమెకు పెద్దగా జ్ఞానం లేదని ఆమె వ్యాఖ్యల్లోనే తెలుస్తోంది. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు భారీగా అప్పులు చేసి, ఆ మొత్తాన్ని సోనియా గాంధీకి సమర్పిస్తున్నాయని చెప్పడం కంటే తెలివితక్కువ ప్రకటన మరొకటి ఉండదు. కనీసం ఒక్క రూపాయి దారి మళ్లించినట్లు నిరూపించాలి. లేదా ఇటువంటి నిరాధారమైన, అనవసరమైన ఆరోపణలు చేసినందుకు సోనియా గాంధీకి క్షమాపణ చెప్పాలి. లేదంటే కంగనాపై పరువునష్టం దావా వేస్తాం' అని కాంగ్రెస్ సీనియర్ నేత, రాష్ట్ర మంత్రి విక్రమాదిత్య సింగ్ సవాల్ విసిరారు. 'ఎమ్మర్జ్÷న్సీ' సినిమాకు సెన్సార్ బోర్డు అనుమతి ఇవ్వకపోవడంతో బాధలో ఉన్న ఆమె.. ఈ తరహా వ్యాఖ్యలు చేసి ఉండవచ్చని వ్యంగ్యాస్త్రాలు విసిరారు. హిమాచల్‌లోని మండీ ఎంపీగా ఉన్న కంగనా రనౌత్.. ఆ రాష్ట్ర ప్రభుత్వంపై ఇటీవల తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

# కార్మిక చట్టాలను పోరాడి రక్షించుకుందాం.

## - సిఐటియు జిల్లా కన్వీనర్ కే. చంద్రశేఖర్.

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, సెప్టెంబర్ 23:**



కార్మిక చట్టాలను పోరాడి రక్షించుకుందాం అని, కేంద్రం ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ లకు వ్యతిరేకంగా ఉద్యమించాలని సిఐటియు జిల్లా కన్వీనర్ కే. చంద్రశేఖర్ అన్నారు. కేంద్రలోని బిజెపి ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు అవలంబిస్తున్న దానికి వ్యతిరేకంగా ఈ నెల 23న బ్లాక్ డే కార్యక్రమాన్ని చేపట్టాలని కేంద్ర కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. అందులో భాగంగా సిఐటియు ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా

సిఐటియు జిల్లా కన్వీనర్ కే చంద్రశేఖర్ మాట్లాడుతూ, 2019లో వేతనాలకోడ్ ను, 2020లో ఐఆర్ కోడ్ ను, ఓఎస్ హెచ్ కోడ్, సామాజిక భద్రత కోడ్ మొత్తము నాలుగు లేబర్ కోడ్లను బిజెపి ప్రభుత్వం పార్లమెంట్లో ఆమోదించిందన్నారు. అంతకుముందు కార్మికులకు ఉన్నటువంటి 29 కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్ లను తీసుకొచ్చి బిజెపి ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ, విదేశీ స్వదేశీ పెట్టుబడుదారులకు యాజమానులకు అనుకూలంగా చట్టాలను కట్టబెట్టే ప్రయత్నం కొనసాగుతుందన్నారు. తద్వారా కార్మిక వర్గానికి తీరని నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంట్లో ప్రజాస్వామ్య బద్దంగా చర్చలు జరపకుండా యాజమాన్యాల కొమ్ముగాస్తు, గత నాలుగు సంవత్సరాలుగా ఈ లేబర్ కోడ్లను రద్దు కోసం రెండుసార్లు దేశవ్యాప్త సమ్మెలు జరిగిన, బిజెపి ప్రభుత్వం కార్మికుల పోరాటాలను లెక్కచేయకుండా, 2024 పార్లమెంట్లో ఎన్నికల సందర్భంలోనూ వామపక్షాలు ప్రతిపక్ష పార్టీలు దేశవ్యాప్తంగా లేబర్ కోడ్ రద్దు చేయాలని వ్యతిరేకించినప్పటికీ కూడా బిజెపి కార్మిక వర్గానికి ద్రోహం చేయడానికి నిశ్చయించుకుందని ఆయన అన్నారు. దేశంలో ఇప్పటికే అనేక రాష్ట్రాల్లో ఈ లేబర్ కోడ్లను అమలు చేసేందుకు రూల్స్ తీసుకొచ్చిందని,

కొన్ని రాష్ట్రాల్లో అమలు చేయడం కోసం ప్రయత్నం కొనసాగుతుందని అన్నారు. అందుకోసమే మహిళా కార్మికులు హక్కులు ఆరోగ్యం సంక్షేమం తదిత అనేక ప్రాథమిక హక్కులను భంగం కలిగించే ఈ లేబర్ కోడ్ లను నిరసిస్తూ కార్మికులు వేలాది మంది పాల్గొని వీటికి వ్యతిరేకంగా పోరాటాలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అరుణ్, దొడ్లే మోహన్, నర్సింలు, ఇంద్ర కుమార్, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు దుప్పట్లు పంపిణీ చేసిన అర్బన్ ఎమ్మెల్యే.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, సెప్టెంబర్ 23:**



భారతదేశ ప్రధానమంత్రి నరేంద్రమోడీ జన్మదినం సందర్భంగా 15 రోజుల పాటు జరిగే సేవా మహోజ్ఞాన కార్యక్రమంలో భాగంగా నిజామాబాద్ రైల్వే స్టేషన్ లో సోమవారం నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతు, భరతమాత ముద్దుబిడ్డ మూడోసారి భారతదేశ ప్రధానిగా సేవాలాందిస్తున్న నరేంద్రమోదీ ప్రపంచ స్థాయి నాయకునిగా ఎదగడం భారతీయులంతా గర్వించదగ్గ విషయం అని అన్నారు. ఆ మహనీయుని జన్మదినం సందర్భంగా భారతీయ జనతా పార్టీ సేవా మహోజ్ఞానం కార్యక్రమాలు దేశమంతట నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలో మొదటి రోజు జిల్లా పార్టీ కార్యాలయంలో రక్తదాన శిబిరం, ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నదానం, పండ్ల పంపిణీ కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. సోమవారం రైల్వే స్టేషన్ లో నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## అకౌంట్స్ గెజిటెడ్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక.




**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, సెప్టెంబర్ 23:**

తెలంగాణ ట్రెజరిస్, అకౌంట్స్ గెజిటెడ్ సర్వీసెస్ అసోసియేషన్ సాధారణ సర్వసభ్య సమావేశం సోమవారం నూతన కలెక్టరేట్ లోని ట్రెజరీ హాల్ లో నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సమావేశాన్ని అధ్యక్షులు రాములు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ట్రెజరి డిపార్ట్ మెంట్ సమస్యల గురించి చర్చించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ట్రెజరీ అకౌంట్స్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు గందల పురుషోత్తం రెడ్డి, ప్రధాన కార్యదర్శి పరుశురాం, ఇతర కార్యవర్గ సభ్యులు సాయి రెడ్డి, శ్రీనివాస్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్, టీటీఎన్ జీవోఏ అధ్యక్ష, కార్యదర్శులు మారుతి, కార్తీక్, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కట్ట శ్రీవాస్ లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ట్రెజరరీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# స్త్రీనిధి అవినీతి దోషులను రక్షించే ప్రయత్నం తగదు.

## - బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్.

**వేగుచుక్క న్యూస్, హైదరాబాద్, సెప్టెంబర్ 23:**

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో స్త్రీ నిధి నిధుల్లో జరిగిన అవినీతి కుంభకోణంపై దర్యాప్తుకు ఆదేశాలు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం, దర్యాప్తును వేగవంతం చేసి దోషులను కఠినంగా శిక్షించాలని బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. డ్వాక్రా మహిళలకు తక్కువ వడ్డీకి రుణాలు మంజూరు చేసి వారి ఆర్థికాభివృద్ధికి దోహదపడే విధంగా రూపకల్పన గత ప్రభుత్వాలు చేశాయన్నారు. కానీ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో స్త్రీ నిధి నిధుల్లో భారీ ఎత్తున అవినీతి కుంభకోణం జరిగిందని, ప్రధాన సూత్రధారికి ఇంకా దాదాపు నెలకు నాలుగు లక్షల రూపాయల వేతనం ఇస్తున్నారని అన్నారు. ఆ అవినీతి తిమింగలాన్ని ఆ సంస్థలో కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించడం సరైంది కాదని అన్నారు. దీనివల్ల రేవంత్ రెడ్డి ప్రభుత్వ కూడా గత బీఆర్ఎస్ ప్రభుత్వ విధానాలనే అనుసరిస్తుందని ప్రజలకు అనుమానాలొస్తాయని దండి వెంకట్ తెలిపారు. గత పదమూడు సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నవారిపై వచ్చిన ఆరోపణలను నిగ్గు




తేల్చడానికి విచారణకు ఆదేశించారు రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అని అన్నారు. కానీ దర్యాప్తును నీరుగార్చేందుకు అవినీతి తిమింగలం తమ్ముడు సీఎం పేషీ లో ఉండే వ్యక్తి ద్వారా ప్రయత్నిస్తున్నట్లు మీడియా సాధనాల్లో కథనాలు వస్తున్నాయని అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి జోక్యం చేసుకొని దర్యాప్తు వేగవంతం చేసి,

దోషులను కఠినంగా శిక్షించాలని, స్త్రీ నిధి సంస్థ నుండి తొలగించిన 700 మంది సిబ్బందిని తిరిగి తిసుకోవాలని దండి వెంకట్ కోరారు.

## పిడిఎస్ యూ అర్ధశతాబ్ద సభకు తరలిరండి.



**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, సెప్టెంబర్ 23:**

ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో జరిగే పి.డి.ఎస్.యూ అర్ధ శతాబ్ద సభను విజయవంతం చేయాలని నాయకులు రవీందర్, దేవిక లు విద్యార్థి లోకానికి పిలుపునిచ్చారు. పి.డి.ఎస్.యూ అర్ధ శతాబ్ద సభ పోస్టర్స్ ను సోమవారం నగరంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పిడిఎస్ యూ నాయకులు మాట్లాడుతూ, గత 50 ఏళ్ల నుండి విద్య రంగ సమస్యలపైన, శాస్త్రీయ విద్యా సాధనకై, సమ సమాజ స్థాపనకై, నూతన ప్రజాస్వామిక విప్లవం కోసం, విద్య ప్రైవేటీకరణ కార్పొరేటికరణ కు వ్యతిరేకంగా పిడిఎస్ యూ విద్యార్థి సంఘం పోరాడుతూ వస్తుందని అన్నారు. విద్యార్థి ఉద్యమంలో జార్జ్ రెడ్డి, జంపాల చంద్రశేఖర్ ప్రసాద్, రంగవల్లి తదితర ఎందరో విద్యార్థి రత్నాలు బిగిపిడికిలి జెండా కోసం తమ ప్రాణాలను తృణ ప్రాయంగా అర్పించరని అన్నారు. వారి పోరాట వారసత్వాన్ని కొనసాగించాలని, 24 న జరిగే పిడిఎస్ యూ శతాబ్దోత్సవ సభను వేల సంఖ్యలో విద్యార్థులు హాజరై విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్ యూ నాయకులు రాకేష్, పాండు, నిరాజ్, రాము, సాయి, మహేష్, వికాస్, శివ తదితరులు పాల్గొన్నారు.

# జీజీహెచ్ లో నిధుల దుర్వినియోగంపై స్పందించాలి.

## - సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ డిమాండ్.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, సెప్టెంబర్ 23**

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్) లో నిధుల దుర్వినియోగంపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని, దుర్వినియోగమైన నిధులను రికవరీ చేసి,

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ (ప్రజా పంథా) నిజామాబాద్ నగర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయం ముందు సోమవారం ధర్నా నిర్వహించి, కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ (ఎం.ఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) పార్టీ నగర కార్యదర్శి ఎం.సుధాకర్ మాట్లాడుతూ, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్) లో కోట్లాది రూపాయల నిధులు దుర్వినియోగం అవుతున్నట్టు, ప్రభుత్వ నిబంధనల ఉల్లంఘనలు తరచూ జరుగుతున్నట్టు పత్రికల్లో కథనాలు వచ్చాయన్నారు. జీజీహెచ్ ఆరోగ్యశ్రీ విభాగంలో ఉద్యోగుల నిర్లక్ష్యంతో సుమారు 10 కోట్ల రూపాయల వరకు నష్టం వాటిల్లిందన్నారు. ఆరోగ్యశ్రీ నిధులు జీజీహెచ్ కు రాకపోవడంతో ఎన్నో రకాల వైద్య సేవలు,



పరికరాలు రోగులకు అందకుండా పోయాయన్నారు. బాధ్యులైన సిబ్బందిపై జీజీహెచ్ అధికారులు తీసుకున్న చర్యలు శూన్యమన్నారు. సరిపడా మందులు లేక, రోగులు ప్రైవేటు మెడికల్ షాపుల్లో మందులు కొనాల్సి వస్తుందన్నారు. రోగులకు, వారి అటెండర్ కు నాసిరకం భోజనం పెడుతున్నారన్నారు. లక్షలాది రూపాయల నిధులు లెక్కల్లో చూపిస్తున్నా, అవి రోగులకు అందడం లేదని ఆరోపించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అధికారులు, సిబ్బంది, కాంట్రాక్టర్లు కుమ్మక్కయ్యారని ఆరోపించారు. చికిత్స కోసం వస్తున్న పేషంట్లను అక్కడి సిబ్బంది కార్పొరేటు ప్రైవేటు ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారని ఆరోపించారు. తక్షణమే ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో జరుగుతున్న నిధుల దుర్వినియోగంపై జిల్లా అధికారులు, ప్రభుత్వం తక్షణమే స్పందించాలన్నారు. బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకొని దుర్వినియోగమైన నిధులను రికవరీ చేయాలన్నారు. రోగులకు అన్ని రకాల చికిత్సలు అందించాలని, సరిపడా మందులు, నాణ్యమైన భోజనం అందించాలని ప్రభుత్వాన్ని, జిల్లా అధికారులను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.గణేష్, ఐ.ఎఫ్.టి.యు జిల్లా నాయకులు బి.మురళి, టి. విఠల్, పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షుడు సాయిబాబా, పీఓడబ్ల్యూ నాయకులు అమూల్య, లలిత, నాయకులు మహిపాల్, నసీర్, మణెమ్మ, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# అనుమానంతో భార్యను చిత్రహింసలు.

**స్నేహితుడితో కలిసి 20రోజులపాటు ఇంట్లో వేధింపులు.**

**తప్పించుకొని తల్లిదండ్రులవద్దకు చేరిన బాధితురాలు.**

**చికిత్స పొందుతూ ఆస్పత్రిలో కన్నుమూత.**

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, సెప్టెంబర్ 23:**

కట్టుకున్న భార్యను 20 రోజులపాటు ఇంట్లో బంధించి చిత్రహింసలు పెట్టిన భర్త. చివరకు తన స్నేహితుడితో కలిసి పురుగుల మందు తాగించి ఆమెను హత్యచేసినట్టు తెలిసింది. ఈ ఘటన కామారెడ్డి జిల్లా కేంద్రంలోని న్యూ హౌసింగ్ బోర్డు కాలనీలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని న్యూహౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన గంగాధర్ గౌడ్ తో తొమ్మిదేళ్ల క్రితం రంగారాణి (30)కి పెళ్ల య్యింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. గత కొన్నేళ్లుగా గంగాధర్ గౌడ్ విశాఖపట్టణానికి చెందిన బాలాజీ తో స్నే హం చేస్తున్నాడు. ఈ క్రమం లో భార్యపై అనుమానం పెం చుకున్న గంగాధర్ గౌడ్ ఆమెను 20రోజులపాటు ఇంట్లో బంధించి చిత్రహింసలు పెట్టాడు. చివరకు పురుగుల మందు తాగించడంతో ఆమె తప్పించుకొని తల్లిదండ్రుల వద్దకు చేరుకుంది. వెంటనే వారు నిజామాబాద్ లోని ప్రైవేట్ ఆస్ప త్రిలో చేర్పించారు. పరిస్థితి ఆందోళన కరంగా ఉండడంతో



హైదరాబాద్ లోని నిమ్స్ కు తరలించగా చికిత్స పొందుతూ శనివారం కన్నుమూసింది. రంగారాణి తండ్రి రాజేశ్వర్ గౌడ్ పోలీసులకు ఫిర్యా దు చేశాడు. తన కూతురిని అల్లుడు చిత్ర హింసలు పెట్టి పురుగుల మందు తాగించాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఇదిలా ఉండగా, గంగాధర్ గౌడ్ రంగారాణిపై దాడి చేసింది వాస్తవమేనని, ఆమె ఆత్మహత్యా యత్నం చేసి ఉంటుందని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కేసు నమోదు చేసు కొని దర్యాప్తు చేస్తున్నామని, పూర్తి వివరాలు విచారణ అనంతరం తెలుస్తాయని పోలీసులు పేర్కొన్నారు.

## శ్రీలంక అధ్యక్షుడిగా దిసానాయకే ప్రమాణం

కొలంబో: శ్రీలంకలో నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు దిసానాయకే సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. మార్క్సిస్ట్ పార్టీ లీడర్ అనుర కుమార దిసానాయకే ఆ దేశ అధ్యక్షుడిగా పగ్గాలు చేపట్టారు. సెప్టెంబర్ 21న జరిగిన ఎన్నికల్లో మార్క్సిస్ట్-లీనింగ్ నేషనల్ పీపుల్స్ పవర్ కూటమి అధినేతగా పోటీ చేసిన 55 ఏళ్ల దిసానాయకే మాజీ అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘేను ఓడించాడు. శ్రీలంక ఆర్థిక సంక్షోభాన్ని ఒంటరిగా పరిష్కరించుకోలేదని దిసానాయకే అన్నారు. ప్రమాణస్వీకరారం అనంతరం ఆయన మాట్లాడుతూ.. నేను మాంత్రికుడిని కాదు.. సాధారణ పౌరుడిని అని ముందే చెప్పాను. నాకు తెలిసినవి, తెలియనివి ఉన్నాయి. ఈ దేశాన్ని ఉద్ధరించడానికి విజ్ఞానం, నైపుణ్యాలు ఉన్నవారిని సేకరించడమే నా లక్ష్యం.' అని ఆయన అన్నారు. చైనా, భారత్, మాల్దీవ్ దేశాలకు చెందిన నాయకులు సోమవారం దిసానాయకేకు అభినందనలు తెలిపారు. శ్రీలంక తన జాతీయ స్థిరత్వం, అభివృద్ధిని కొనసాగించాలని చైనా భావిస్తోందని.. సాఫీగా ఆర్థిక మరియు సామాజిక అభివృద్ధిలో నిర్మాణాత్మక పాత్ర పోషించడానికి సిద్ధంగా ఉందని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి సోమవారం తెలిపారు. 2000లో తొలిసారిగా పార్లమెంటుకు ఎన్నికైన దిసానాయకే అప్పటి అధ్యక్షురాలు చంద్రికా కుమారతుంగ ఆధ్వర్యంలో వ్యవసాయం, నీటిపారుదల శాఖ మంత్రిగా కొంతకాలం పనిచేశారు. 2019లో తొలిసారి అధ్యక్ష పదవికి పోటీ చేసి రాజపక్సే చేతిలో ఓడిపోయారు. మళ్లీ 2024లో రణిల్ విక్రమసింఘేపై అధ్యక్ష పోటీలో గెలిచారు.

శ్రీలంక దేశంలో 2022 సంవత్సరంలో ఆహారాలు, మందులు, వంటగ్యాస్, ఇంధనం వంటి నిత్యావసరాల కొరత ఏర్పడింది. తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని శ్రీలంక ఎదుర్కొంది. ప్రజలు నిరసనలు చేయడంతో అప్పటి అధ్యక్షుడు గోటబయ రాజపక్స అధ్యక్ష పదవికి రాజీనామా చేసి దేశం విడిచి పారిపోయాడు.

# చిరుకు గిన్నీస్ రికార్డ్స్‌లో చోటు



అభినందనలు తెలిపిన తెలుగు సిఎంలుకృతజ్ఞతలు తెలిపిన చిరంజీవి

గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో తనకు చోటు దక్కడంపై అభినందనలు తెలిపిన తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ప్రముఖులకు అగ్ర కథానాయకుడు చిరంజీవి ధన్యవాదాలు చెప్పారు. మోస్ట్ ప్రొలిఫిక్ ఫిల్మ్ స్టార్ ఇన్ ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీ యాక్టర్, డ్యాన్సర్‌గా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకున్నందుకు పద్మవిభూషణ్ అవార్డు గ్రహీత, మెగాస్టార్ చిరంజీవికి నా హృదయపూర్వక అభినందనలు. తెలుగు చిత్ర పరిశ్రమకు ఆయన ఎనలేని సేవ చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారు గర్వించదగ్గ విషయం ఇదని ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు పోస్ట్ పెట్టారు. దీనిపై చిరంజీవి స్పందించారు. మీ ఉదారమైన మాటలకు, అభినందనలకు ధన్యవాదాలు చంద్రబాబునాయుడు గారు అని పేర్కొన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం చిరుకు అభినందనలు తెలిపారు. ప్రముఖ సినీ నటుడు కొణిదెల చిరంజీవికి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కడం తెలుగు వారు గర్వించదగ్గ విషయం. ఈ శుభసందర్భంలో వారికి నా అభినందనలు అని పోస్ట్ చేయగా.. దానిపై స్పందిస్తూ.. మీ హృదయపూర్వక అభినందనలకు థాంక్యూ సో మచ్ రేవంత్ రెడ్డి గారు అని సమాధానం ఇచ్చారు.
'చిరు కెరీర్‌లో ఇప్పటివరకూ 24,000 డ్యాన్స్ స్టెప్పులు వేసినట్లు ఇప్పుడే తెలుసుకున్నాను. అద్భుతమైన సినీ ప్రయాణమిది. మోస్ట్ ప్రొలిఫిక్ ఫిల్మ్ స్టార్ ఇన్ ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీ యాక్టర్, డ్యాన్సర్‌గా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నందుకు కంగ్రాట్స్' అని రాజమౌళి ఎక్స్‌లో పోస్ట్ పెట్టగా.. థాంక్యూ డియర్ రాజమౌళి. వాస్తవంగా ఈ విషయం నాక్కూడా ఇప్పుడే తెలిసిందని పేర్కొన్నారు. 156 చిత్రాలు.. 537 పాటలు.. 24వేల స్టెప్పులతో అలరించినందుకు చిరంజీవికి ఈ రికార్డు దక్కిన విషయం తెలిసిందే. ఆదివారం సాయంత్రం గిన్నిస్ బుక్ ప్రతినిధి రిచర్డ్ స్టెన్నింగ్, బాలీవుడ్ నటుడు ఆమిర్ ఖాన్ చేతుల మీదుగా చిరు ఈ అవార్డును అందుకున్నారు.

# దేవర ప్రీ రిలీజ్ ఈవెంట్ రద్దు


అభిమానులకు క్షమాపణలు చెప్పిన నిర్వాహకులు




'దేవర' ప్రీ రిలీజ్ ఈవెంట్ రద్దు కావడం దురదృష్టకరమని కార్యక్రమం నిర్వాహకులు అన్నారు. ఎన్టీఆర్ అభిమానులకు క్షమాపణలు చెబుతూ ఓ అధికారిక ప్రకటనను విడుదల చేశారు. ఎక్స్ వేదికగా ఈ ఈవెంట్ కోసం వాళ్లు చేసిన ఏర్పాట్ల వివరాలను తెలుపుతూ పోస్ట్ పెట్టారు. ఎన్టీఆర్‌పై మీ అందరికీ ఉన్న అపారమైన అభిమానం, ప్రేమను మేము అర్థం చేసుకున్నాం. ఆరు సంవత్సరాల తర్వాత సోలోగా తెరపై కనపడుతుండడంతో మీరంతా మరింత ఉత్సాహంగా ఉన్నారు. తాజాగా జరిగిన పరిణామంతో మీరంతా నిరుత్సాహానికి గురయ్యారని బరువెక్కిన హృదయంతో ఈ నోట్‌ను విడుదల చేస్తున్నాం. ఇందులో అక్కడ జరిగిన పరిస్థితిని పూర్తిగా వివరించాలన్నదే మా ప్రయత్నం. మీకు జరిగిన అసౌకర్యానికి హృదయపూర్వక క్షమాపణలు చెబుతున్నాం. ఎన్టీఆర్ అభిమానులను దృష్టిలోపెట్టుకొని మేము ఈ ఈవెంట్‌ను బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటుచేయాలని భావించాం. కానీ, వినాయక చవితి వేడుకలు, వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో దీన్ని హోటల్‌లో ఏర్పాటుచేయాల్సి వచ్చింది. పరిమితులకు మించి పాస్‌లు ఇచ్చామంటూ సోషల్ మీడియాలో జరుగుతోన్న ప్రచారం పూర్తిగా అబద్ధం. మేం ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ 30, 35వేల మంది అభిమానులు హాజరయ్యారు. అధిక సంఖ్యలో ప్రజలు రావడంతో గేట్లు కిక్కిరిసిపోయాయి. బారికేడ్లు పగలగొట్టడంతో పరిస్థితి అదుపుతప్పింది. దీంతో ఈవెంట్‌ను రద్దు చేయాల్సి వచ్చింది. అదుపు చేయలేని పరిస్థితులు తలెత్తడంతో మేం ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది. అభిమానుల భద్రత దృష్ట్యా ఈ కఠిన నిర్ణయం తీసుకున్నాం. ఎన్టీఆర్‌పై మీకున్న అచంచలమైన మద్దతు, అంకితభావం ఆయన్ని ఈ స్థాయిలో ఉంచాయి. మమ్మల్ని మీరు ఎప్పటికీ ఇలానే సపోర్ట్ చేస్తారని ఆశిస్తున్నాం' అని తెలుపుతూ శ్రేయాస్ మీడియా ఓ లేఖను విడుదల చేసింది.కొరటాల శివ దర్శకత్వంలో ఎన్టీఆర్ హీరోగా తెరకెక్కిన 'దేవర' సినిమా భారీ అంచనాల మధ్య 27న ప్రేక్షకుల ముందుకురానుంది.

# హరిహరవీరమల్లుపై కీలక అప్‌డేట్

మార్చి 28న విడుదల కానున్నట్లు ప్రకటన



పవన్ కల్యాణ్ కథానాయకుడిగా రూపొందుతున్న పీరియాడిక్ యాక్షన్ అడ్వెంచర్ మూవీ 'హరి హర వీరమల్లు' క్రిష్, జ్యోతికృష్ణ దర్శకత్వంలో ఇది సిద్ధమవుతోంది. రెండు భాగాలుగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. తొలి భాగానికి సంబంధించి చిత్రీకరణ ముగింపుదశకు చేరుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే 'హరిహర వీరమల్లు' రిలీజ్ డేట్‌ను చిత్రబృందం తాజాగా ప్రకటించింది. వచ్చే ఏడాది మార్చి 28న ప్రపంచవ్యాప్తంగా దీనిని విడుదల చేయనున్నట్లు తెలిపింది. 'అన్‌స్టాపబుల్ ఫోర్స్, అన్‌బ్రేకబుల్ స్పిరిట్ మార్చి 28న విడుదల కానుంది' అని పేర్కొంది. దీనిపై పవన్ అభిమానులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. పవన్ కల్యాణ్ రాజకీయాల్లో బిజీగా ఉండటంతో ఈ సినిమా చిత్రీకరణ వాయిదా పడుతూ వస్తోంది. తన సన్నివేశాలను పూర్తి చేసేందుకు తాజాగా ఆయన అంగీకరించారు. ఈ క్రమంలోనే సోమవారం ఉదయం 7 గంటలకు విజయవాడలో సిద్ధం చేసిన భారీ సెట్‌లో షూట్ మొదలైంది. ఈ విషయాన్నీ చిత్రనిర్మాణ సంస్థ తెలియజేసింది. హాలీవుడ్ స్టంట్ డైరెక్టర్ నిక్ పాల్ ఆధ్వర్యంలో భారీ యాక్షన్ సన్నివేశాలు ఇక్కడ షూట్ చేయనున్నారని సమాచారం. పవన్‌తోపాటు కీలక నటీనటులు ఇందులో భాగం కానున్నారని తెలుస్తోంది.రెండు భాగాలుగా రానున్న ఈ మూవీ తొలిభాగం 'హరిహర వీరమల్లు పార్ట్ 1: స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' పేరుతో విడుదల కానుంది. అనుపమ్‌ఖేర్, బాబీ డియోల్, నిధి అగర్వాల్, నోరాహి ఫతేహి, విక్రమ్ జీత్, జిషుసేన్ గుప్త కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి ఎం.ఎం.కీరవాణి స్వరాలు అందిస్తున్నారు. మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఇది నిర్మితమవుతోంది.






# ఆస్కార్‌కు లాపతా లేడీస్ ఎంపిక




బాలీవుడ్ నటుడు ఆమిర్ ఖాన్ మాజీ సతీమణి కిరణ్‌రావు దర్శకత్వంలో వచ్చిన 'లాపతా లేడీస్' అరుదైన ఘనత సాధించింది. 2025 ఆస్కార్‌కు మనదేశం నుంచి ఎంపికైంది. ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఈ విషయాన్ని అధికారికంగా తెలిపింది. స్పర్శ్ శ్రీవాత్సవ, నితాన్షి గోయెల్, ప్రతిభ తదితరులు ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రం ఇటీవల విడుదలై ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే.
మన దేశం తరపున ఈ సినిమా ఆస్కార్‌కు కచ్చితంగా ఎంపికవుతుందని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో కిరణ్‌రావు ధీమా వ్యక్తంచేశారు. '2025లో ఆస్కార్ అవార్డుల్లో భారత్ తరపున అధికారిక ప్రవేశానికి 'లాపతా లేడీస్' అర్హత సాధిస్తుందని నాకు పూర్తి నమ్మకముంది. ఈ సినిమా ఆస్కార్ వేదికపై మన దేశానికి ప్రాతినిధ్యం వహించాలనేది నాతో పాటు మా యూనిట్ అందరి కోరిక' అని కిరణ్‌రావు ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. 2001 కాలపు చిత్రకథ ఇది. గ్రామీణ ప్రాంతానికి చెందిన ఇద్దరు నవ వధువులు రైలు ప్రయాణంలో అనుకోకుండా తారుమారైన సంఘటన ఇతివృత్తంగా 'లాపతా లేడీస్'ని తెరకెక్కించారు. ప్రముఖ నటుడు ఆమిర్ ఖాన్ నిర్మించారు. ప్రతిష్టాత్మక టోరంటో ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ (టీఐఎఫ్ఎఫ్) వేడుకలో గతేడాది ఈ చిత్రాన్ని ప్రదర్శించడం విశేషం. సుప్రీంకోర్టు 75 ఏళ్ల వేడుకలో భాగంగా.. అడ్మినిస్ట్రేటివ్ భవనంలోని సి- బ్లాక్‌లో గల ఆడిటోరియంలో ఈ చిత్రాన్ని ప్రదర్శించారు. అలాగే 'ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ మెల్‌బోర్న్ ' అవార్డుల్లోనూ లాపతా లేడీస్ క్రిటిక్స్ ఛాయిస్ విభాగంలో బెస్ట్ ఫిల్మ్‌గా నిలిచింది.

# కన్నప్ప నుంచి మారెమ్మ పోస్టర్

మంచు ఫ్యామిలీ అభిమానులు ఎదురుచూస్తున్న సోమవారం రానే వచ్చింది. ఈ రోజు కన్నప్ప చిత్రం నుంచి మరో నూతన అప్డేట్ వచ్చింది. ఇప్పటికే గడిచిన రెండు నెలలుగా ప్రతి సోమవారం కన్నప్ప సినిమాలో నటించిన నటీనటులను రివీల్ చేస్తూ వాళ్ల పాత్రలను పరిచయం చేస్తు వస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఇప్పటికే అక్షయ్ కుమార్, శరత్ కుమార్, మధుబాల, దేవరాజ్, ముఖేష్ రిషి, మంచు అవ్రామ్, అర్పిత్ రంకా, టిక్కి పాత్రలకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌లు రిలీజ్ చేశారు. తాజాగా ఈ కన్నప్ప సినిమాలో నటిస్తున్న మరో సీనియర్ నటి ఐశ్వర్య ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. అంతేకాదు ఆమె నటించిన మారెమ్మ పాత్రను, చేసే పనిని రివీల్ చేశారు. అడవిని పీడించే ఆరాచకం.. మారెమ్మ.. కుతంత్రమే తన మంత్రం అంటూ ట్యాగ్ లైన్ తగిలించారు. ఈ లుక్‌లో ఐశ్వర్య చాలా భయంకరంగా, క్రూరంగా ఉంది. ఇప్పుడు ఈ పోస్టర్ సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతోంది.
మంచు విష్ణు కలల సినిమాగా తెరకెక్కుతున్న ఈ సినిమాకు మహా భారతం సీరియల్ డైరెక్టర్ ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తుండగా డిసెంబర్‌లో ఈ సినిమా పాన్ ఇండియా వైడ్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది.